# ఆంధ్రా సింద్‌బాద్

ముప్పై ఏళ్ళుగా "సింద్‌బాద్ ఆఫ్ ఆంధ్రా" గా ప్రసిద్ధి చెందిన కాశీనాథ్ కి ఎన్ని ఖండాలు తిరిగినా, ఎన్ని గండాలు గడిచినా, కాలు దురద మాత్రం తీరలేదు.

ఇంట్లో అందరూ వద్దంటున్నా వినకుండా, ఇదే ఆఖరి ప్రయాణం, ఇక ప్రయాణాలు చేయను సరేనా? అని నచ్చచెప్పి ఓడ పడమటి సముద్రం కేసి పట్టించాడు.

చాలా రోజులు ప్రయాణం సుఖంగా సాగింది. ఎక్కడికెళ్ళినా, అనుభవం పండిన అతని సరుకు లక్షలు సంపాదించసాగింది. ఓడ ప్రయాణాలలో ఆరితేరిన కాశీనాథ్ తుఫాన్లకీ, ఓడ దొంగలకి అందకుండా తన ఓడని చాకచక్యంగా దిక్కులు మార్చుతూ అనేక ద్వీపాలు, దేశాలు తిరిగాడు. ఎప్పటికప్పుడు మిగులు పై కాన్ని సముద్ర కోటీల ద్వారా ఇంటికి పంపించేవాడు.

సముద్ర వర్తకంలో ఒక చమత్కారం వుంది. వద్దన్నకొద్దీ లాభాలెలా వస్తాయో, ప్రమాదాలూ అలానే వస్తాయి. ఎంత జాగ్రత్త పడినా, ఎంత చాకచక్యం చూపించినా చివరికి తప్పించుకోలేని ఓ పెద్ద తుఫాను పాలబడింది వాళ్ళ ఓడ. ఆ దెబ్బకి ఓడ దారి ఓడది, ఓడినవాడి దారి ఓడినవాడిదీ అయింది.

మహా సాహసుడయిన కాశీనాథ్ ఒక కొయ్య ముక్క ఆధారంతో నీటిమీద తేలసాగాడు. వుండీ లేని స్పృహతో ఒక ద్వీపం చేరాడు. చేరుతూనే అక్కడి పరిసరాలను, అక్కడి వాతావరణాన్ని, అక్కడి గాలిలోని వాసననీ పరిశీలించి అది నరమాంస భక్షకులకి నిలయం అని గ్రహించాడు. ఒంటరిగా దానిలో కాలుపెట్టే బదులు తిరిగి సముద్రంలో

పడడమే మేలని అతనికి తెలుసు. కాని నోరు పిడచగట్టుకుపోతోంది. కడుపు గిడసబారి పోతోంది. మెదడు మొద్దుబారిపోతోంది. పైగా సముద్రపు టొడ్డునే వున్న కొబ్బరిచెట్లు కన్ను కొడుతూ పిలుస్తున్నాయి. బొండాలు కూడా అట్టే ఎత్తున లేవు.

అంతగా అయితే నాలుగు బొండాలు పుచ్చుకుని మళ్ళీ సముద్రంలో పడచ్చులే అనుకుని మెల్లగా కాలీడ్చుకుంటూ ఓ చెట్టు దగ్గరికి వెళ్ళాడు. నిశ్శబ్దంగా నాలుగు బోండాలు లేతవి కోసి, బొడ్డులో వున్న కత్తితో రంధ్రాలు చేసి నీళ్ళు తాగాడు. లేత కొబ్బరి తిన్నాడు.

వెంటనే బయలుదేరేవాడే! కాని ఇన్ని నీళ్ళు, ఇంత కొబ్బరి కడుపులో పడేటప్పటికి ఎక్కడలేని నిద్ర ముంచుకు రాసాగింది. రెండు మూడు రోజులు దాదాపు సముద్రం మీద నిరాహారంగా వుండిపోయాడు కదా! ఒక్కక్షణం ఆలోచించాడు. సామాన్యంగా మనుష్యులు సముద్రపు టొడ్డు మీద కనబడడం ఆలస్యం పెద్ద గోలగా వచ్చేస్తారు. నరమాంసభక్షకులు ఇంతవరకు ఎవడూ రాలేదంటే అంతా వేరే ద్వీపం మీదనో, లేకపోతే ద్వీపం అవతలి వైపో వుండివుంటారు. రెండో క్షణం నిద్రలోకి జారిపోయాడు కాశీనాథ్.



భయంకరమైన అరుపులు, కేకల మధ్య హఠాత్తుగా మెలకువ వచ్చింది కాశీనాథ్‌కి కళ్ళు తెరిచాడు. చుట్టూ నరమాంసభక్షకులు. ఒక్కసారి కళ్ళు చిట్లించి చూశాడు. ఫరవాలేదు. ఈ జాతి నరమాంసభక్షకులు కొంతనయం మనుష్యులను వున్న పళంగా పీక్కుతినరు. వెండి గంగాళాలలో వుడికించి, బంగారు కత్తులతో, ఫోర్కులతో తింటారు. బాగా నాగరికులు, నాగరికులు కదా అందుచేత భయస్తులు కూడాను.

వెనుకటికోసారి కాశీనాథ్ ఈ ద్వీపాలలో ఒకదాని మీద దాడిచేసి వెండి బంగారాలు దోచుకుని, దొరికిన ఒక నరమాంసభక్షకుడిని కొంతకాలం తన బానిసగా వాడుకున్నాడు. వాడి ద్వారా వాళ్ళ భాష కూడా కొంత తెలుసుకున్నాడు. కాని పాపం వాడికి వీళ్ళు పెట్టే తిండి రుచించక నిస్సహాయంగా వాడి చేతులూ, కాళ్ళూ వాడే తినేసి చచ్చిపోయాడనుకోండి. అది వేరే విషయం.

కాశీనాథ్ మెల్లిగా లేచాడు. వాళ్ళ నాయకుడిని సమీపించాడు. "నన్నేం చేస్తారిప్పుడు" అని అడిగాడు.

వాడు కళ్ళింతచేసి, "మా భాష నీకెలా తెలుసు?" అన్నాడు. భయం భయంగా

"నేను నరమాంస భక్షకుడినే" అనబోయి నాలిక్కరుచుకుని, "అదంతా నీకెందుకు? ముందు అడిగిందానికి సమాధానం చెప్పు అని డబాయించాడు కాశీనాథ్.

వాడదురుకుని "వండుకు తింటాం" అని నసిగాడు.

"ఏడిశారు! నేనేమీ రుచిగా వుండను" అన్నాడు గంభీరంగా కాశీనాథ్.

"ఏం, ఎందుకుండవు?" అన్నాడు వాడు ఇంకా భయపడుతూ.

"నాకూ తెలియదు, కావాలంటే ఇదిగో చూసుకో రుజువు" అంటూ బొడ్డులోని కత్తి తీసి కుడికాలి పిక్కలోని ఒక ముక్క కోసి వాడికిచ్చారు.

"వాడు ఆశ్చర్యపోతూ ఆ ముక్క కొరికి "థూ" అని "ఈ వెధవ తిండానికి పనికిరాడు పదండి" అని గోలగా పరివారంతో సహా ద్వీపం లోపలికి వెళ్ళిపోయాడు.

మరికొన్నాళ్ళు ధైర్యంగా వాళ్ళ మధ్యనే తిరిగి, మరికొంత వెండి బంగారాలతో సహా ఎలాగో ఇంటికి చేరి "హమ్మయ్య" అంటూ తన కుడి కొయ్యకాలు విప్పి గోడకి తగిలించి హాయిగా మంచం మీద వాలాడు "కాశీనాథ్ ద శైలర్".